క్లుప్తంగా

రేపు ఉచిత ధ్యాన శిబిరం

రాయవరం: రాయవరంలోని సత్యసాయి సేవా మందిరంలో ఈ నెల 27న ఉచిత ధ్యాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా వలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం 3.గంటల వరకు జరిగే ఉచిత ధ్యాన శిబిరంలో యోగా, ధ్యానంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాయవరం పరిసర గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

గ్రీన్ ట్యాక్స్ తగ్గింపుపై హర్షం

కపిలేశ్వరపురం: మండపేట లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ నాయకులు ఆదివారం మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కలిశారు. గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించడంపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చుండ్రు శ్రీవరప్రకాష్, అధ్యక్షుడు కాయల రమేష్, నాయకులు కావూరి వీర్రాజు, రెడ్డి వీరన్న, గుత్తుల గోవిందు, రేలంగి శివ, రావూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలువ పనులు ప్రారంభం



మురుగు కాలువ పూడిక పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల ఆయకట్టునుంచి మురుగునీరు ప్రవహించే టేకి మురుగు కాలువలో పూడికతీత పనులను ఆదివారం ప్రారంభించారు. మాచర, తాతపూడి నీటిసంఘాల అధ్యక్షుడు కొరపాటి జానకిరామయ్య, మేకా శ్రీరామకృష్ణలు పనులను ప్రారంభించారు. ఖరీఫ్ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాకా శ్రీనివాస్, రైతులు పువ్వుల చిట్టిబాబు, నామాల శ్రీనివాస్, మేకా సత్యవరప్రసాద్, వంటిపల్లి అబ్బు పాల్గొన్నారు.

మాస శివరాత్రి పూజలు



వెంటూరు సోమేశ్వరాలయంలో మాసశివరాత్రి పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరు గ్రామంలో ఆదివారం 257వ మాస శివరాత్రి పూజను వైభవంగా నిర్వహించారు. స్థానిక నీలాంబికా సమేత బసవేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో నిర్వహణా కమిటీ ఆధ్వర్యంలో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. వీరా నారాయణమూర్తి జ్ఞాపకార్థం భార్య ధనలక్ష్మి ఆర్థిక సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఓం నమఃశివాయ నామాన్ని జపించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 21 సంవత్సరాల ఐదు నెలల నుంచి గ్రామంలో మాస శివరాత్రి పూజలను చేస్తున్నామన్నారు. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో మాస శివరాత్రి పూజలు

రాయవరం: మండలంలోని వెంటూరులో వేంచేసిన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వకంగా నమక, చమకాలతో మహాశివుడికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి లక్ష బిల్వార్చన పూజలు, పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. వేద పండితులు తటవర్తి రాఘవరాజు, దువ్వూరి శ్రీరామ శర్మ, వాడ్రేవు వెంకటరావు, వింజమూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో దీప, ధూప సేవ, లింగార్చన, సూర్యనమస్కారాలు, శాంతి హోమం నిర్వహించారు. పిండిప్రోలు నారాయణమూర్తి కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వెంటూరు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ సొమ్ము అందజేత

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 15వ వార్డుకు చెందిన కొమ్మిశెట్టి సత్తిబాబు ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. టీడీపీ సభ్యత్వం ద్వారా చెల్లించిన బీమా మంజూరు కావడంతో ఆదివారం మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా సదరు ఇన్సూరెన్స్ సొమ్ము రూ.5 లక్షలను మృతుడి కుటుంబ సభ్యులకు పార్టీ నాయకులు సమక్షంలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త కుటుంబానికి కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, నాయకులు అల్లూరి రామకృష్ణ చౌదరి, ఉంగరాల రాంబాబు, మత్సా నాగబాబు, కౌన్సిలర్ గ్రంధి వీరవెంకట శ్రీనివాస్, పాలచర్ల వెంకన్నబాబు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు

- సీజనల్ వ్యాధులతో జాగ్రత్తలు తప్పనిసరి
- ఖాళీ స్థలాల్లో పెరిగిన తుప్పలు
- దృష్టి సారించని అధికారులు

రామచంద్రపురం: ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగిందని సంతోషిస్తున్న సమయంలో వర్షాకాలం వస్తుందంటే సీజనల్ వ్యాధులపై ప్రజలు ఇప్పటి నుంచే బెంబేలెత్తిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 19 ఏళ్ల తరువాత ముందుగానే మే నెలాఖరు నాటికి రుతుపవనాలు రావడంతో పాటుగా ఇప్పటికే అల్పపీడనం కారణంగా గత 10 రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో డ్రైన్లలో మురుగునీరు, ఎక్కడ పడితే అక్కడే ఉంటున్న చెత్తా చెదారంతో వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు ఇప్పటి నుంచి దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భావిస్తున్నారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వానాకాలం సీజన్ ప్రారంభం అవుతుండగా ప్రస్తుతం మే నెల చివరి వారం నుంచే వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో రోడ్లు పల్లపు ప్రాంతాలు జలశయాలుగా మారుతున్నాయి. పట్టణ, శివార్లు, గ్రామాల్లో అపరిశుభ్ర పరిసరాలతో పాటు అక్కడక్కడ వాన నీటి నిల్వలతో దోమలు విజృంభిస్తున్నాయి. రొంప, దగ్గు, జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వైద్య ఆరోగ్య శాఖ ముందస్తుగా అప్రమత్తం కావాల్సిన అవసరం వచ్చింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాల పరిశుభ్రతలను పాటిస్తుండాలి. వైరల్ ఫీవర్, మలేరియా, డయేరియా వంటి వ్యాధులకు మందులను అందుబాటులో ఉంచుతున్నాం. అలాగే ప్రజలు కూడా వర్షాకాలం ప్రారంభంలో తాగునీటి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకునేలా వారిని చైతన్యం చేసేందుకు కార్యక్రమాలు చేపట్టి ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎస్.ప్రవీణ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, రామచంద్రపురం

పారిశుధ్య పనుల్లో ప్రక్షాళన అవసరం

నియోజకవర్గంలోని మున్సిపాలిటీతో పాటుగా మండల గ్రామాల్లో చాలా చోట్ల డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. దీంతో గ్రామాల్లో ఉన్న మురుగునీరు నిలిచిపోయి రోడ్ల మీదకు వస్తుంది. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగిపోయి ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. పారిశుధ్యం నిర్వహణకు పంచాయతీల్లో లక్షలు వెచ్చిస్తున్న ప్రయోజనం మాత్రం శూన్యంగానే కనిపిస్తుంది. మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా క్షేత్ర స్థాయిలో నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటుందని పుర ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రధాన కూడలిలో ఉంటున్న చెత్తా చెదారం వద్ద పందుల విజృంభణతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి ప్రతి గ్రామంలోనూ ఉందని తెలుస్తోంది.

దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఖాళీ స్థలాలు

మున్సిపాలిటీ పరిధిలో గల 29 వార్డుల్లోని ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. స్థల యజమానులకు ఎన్నిసార్లు మున్సిపాలిటీ అధికారులు నోటీసులు జారీ చేసినా ఫలితం ఉండటం లేదు. దీంతో ఖాళీ ప్రాంతాల చుట్టుపక్కల ఇళ్లలో నివసించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు చేరుకుని మురుగు కూపాలుగా మారి దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. దోమలబారి నుంచి రక్షించుకునేందుకు పట్టణంలో ప్రతి నెలా రూ.లక్షలు దోమల నివారణ మందులకు వెచ్చిస్తున్నారు. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ నెలకొంది. దోమల బారి నుంచి రక్షించుకునేందుకు నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు మున్సిపాలిటీలోనూ ఈ వర్షాకాలం నాలుగు నెలల పాటు నెలకు సుమారుగా రూ.25 నుంచి 30 లక్షల వరకు దోమల చక్రాలు లిక్విడ్లకు వినియోగిస్తున్నట్లు తెలుస్తుంది.

మూడు నెలల పాటు జాగ్రత్తలు అవసరం

రానున్న నాలుగు నెలల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షాల ప్రభావం ఉంటుంది. ప్రతి ఏటా జ్వరాలతో చాలా మంది ఆసుపత్రుల పాలవడంతో పాటు డెంగీ, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతూ మృతి చెందుతున్న విషయం తెలిసిందే. ఆసుపత్రులు కూడా ఇదే సీజన్‌లో కిటకిటలాడుతుండటం చూస్తూనే ఉన్నాం. వ్యాధుల బారి నుంచి బయట పడటానికి ప్రజలు కూడా వేలకు వేలు ప్రైవేటు ఆసుపత్రులకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితులన్నీ రాకుండా కొంతలో కొంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్‌గున్యా మెదడువాపు తదితర వైరల్ ఫీవర్లతో పాటు డయేరియా కూడా ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంది. ఏటా ప్రజలను జ్వరాలు అల్లకల్లోలం చేస్తూనే ఉన్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు కూడా ప్రజలను చైతన్యం చేస్తే కొంత ప్రయోజనం ఉంటుంది.



పోతుల వారి వీధిలో తుప్పలు పేరుకుపోయిన ఖాళీ స్థలం

పుస్తక పఠనంపై సాహిత్య ప్రచారం

కపిలేశ్వరపురం: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస వేదిక ఆధ్వర్యంలో పుస్తక పఠనంపై క్షేత్ర స్థాయిలో సాహిత్య ప్రచారం చేయనున్నట్లు వేదిక జిల్లా కన్వీనర్ మాతా చినబాబు ఆదివారం తెలిపారు. ఇటీవల వేదిక ఆధ్వర్యంలో ముద్రించిన 'గ్రంథాలయ విజ్ఞాన సర్వస్వం వ్యాస సంకలనం 'పుస్తకాన్ని మండపేటలో ఆవిష్కరించామన్నారు. ఆధునిక కాలంలో సాంకేతికత ఎంత పెరుగుతున్నప్పటికీ సమాజ స్థితిగతులను అర్థం చేసుకునేందుకు పుస్తకపఠనం అనివార్యమన్నారు. పఠనాశక్తిని చిన్నారులకు అందించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్ పర్యవేక్షణలో కథలు చెప్పడం, కవితలు రాయడం, సమాజాన్ని ప్రతిబింబించే వివిధ పద్ధతుల్లో సాహిత్య కృషి చేసేందుకు ప్రణాళికను రూపొందించామని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోలు

కపిలేశ్వరపురం: మండలంలోని రైతు సేవా కేంద్రాలు ద్వారా రబీ ధాన్యం నేటికీ కొనుగోలు చేస్తున్నామని మండల వ్యవసాయ శాఖాధికారి కేవీఎస్ రమేష్ కుమార్ ఆదివారం తెలిపారు. ప్రభుత్వం ఆదేశాలు మేరకు జిల్లాలో మరో లక్ష టన్నుల ధాన్యం కొనుగోలుకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో మండలంలో 6వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కావున మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రమేష్ కుమార్ తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే తమ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల సాగుతో భూసారం వృద్ధి



మొగలిపాలెంలో పూత దశకు చేరుకున్న పచ్చిరొట్ట పైరు

కాజులూరు: పచ్చిరొట్ట ఎరువుల సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని డెల్టాలోని పంట భూముల్లో రైతులు రబీ సాగు అనంతరం మూడో పంటగా పచ్చి రొట్ట ఎరువుల పెంపకానికి ప్రాధాన్యం నివ్వాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచిస్తున్నారు. డెల్టాలో కొందరు రైతులు దాళ్వా సాగు అనంతరం అపరాల సాగు చేపట్టగా కొందరు రైతులు జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువులను సాగు చేస్తున్నారు. కొందరు రైతులు దాళ్వా మాసూళ్ల ఆలస్యం కావడంతో పొలాలను ఖాళీగానే వదిలి వేస్తున్నారు. అయితే పెసర, మినుము వంటి అపరాల సాగుకు అవకాశం లేని పొలాల్లో రైతులు జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువుల సాగు చేపడితే భూసారం వృద్ధి చెందుతుందని ఆయన చెబుతున్నారు. పచ్చిరొట్ట ఎరువుల సాగు వలన రైజోబ్యామ్ అనే బ్యాక్టీరియా వృద్ధి చెంది భూసారం పెరుగుతుందని పచ్చిరొట్ట మొక్క వేళ్ల నుంచి నత్రజని భూమిలో చేరుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల సాగు ద్వారా పోషకాలతో కూడిన ఎరువును పొలానికి అందించి తదుపరి వరి సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుడులు సాధించవచ్చన్నారు.

కలియదున్నేందుకు సమయమిదే

పచ్చిరొట్ట ఎరువులను సరైన సమయంలో పొలంలో కలియదున్నాలని ఏవో అశోక్ తెలిపారు. మండల గ్రామాల్లో దాళ్వా అనంతరం సాగు చేసిన పచ్చిరొట్ట పైర్లు దాదాపు ప్రస్తుతం ఏపుగా ఎదిగి కలియదున్నే దశలో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట మొక్కలు గట్టిపడితే పొలానికి మేలు కంటే కీడు ఎక్కువగా జరుగుతుందన్నారు. ఈ సమయంలో పచ్చిరొట్ట పైర్లను కలియ దున్నడం ద్వారా పొలాల్లో మలి సాలు దమ్ము చేసే నాటికి అవి పూర్తిగా చీకిపోయి మట్టిలో కలుస్తాయన్నారు. పూత దశకు రాకముందే పచ్చిరొట్ట మొక్కలను కలియదున్నుకోవాలన్నారు.

అధ్వానంగా మాచరమట్ట రహదారి



అధ్వానంగా మాచరమట్ట - కొండాలమ్మ చింత రహదారి

కపిలేశ్వరపురం: అంగర- కపిలేశ్వరపురం రహదారిలోని కొండాలమ్మ చింత నుంచి మాచర గ్రామ శివారు మాచర మట్టలుకు వెళ్లే రహదారి గోతులతో పూర్తిగా అధ్వానంగా మారింది. ఈ మార్గంలో మాచర, కోరుమిల్లి, వాకతిప్ప, కపిలేశ్వరపురం, అంగర, తదితర గ్రామాలకు ప్రయాణికులు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఆయా గ్రామాల్లోని ఆయకట్టు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఈ రహదారిగుండా తరలిస్తుంటారు. రహదారిలోని రాళ్లు చెల్లాచెదురుగాపడి ఉన్నాయి. దీనితో ద్విచక్రవాహనదాలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రిళ్లు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సంబంధిత అధికారులు స్పందించి రహదారిని మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

వెలంపాలెం క్రీడాకారుడికి గోల్డ్ మెడల్



పతకాలు అందుకుంటున్న విజేతలు

రామచంద్రపురం రూరల్: మూడవ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ కాంపిటీషన్లో మాస్టర్స్ క్యాటగిరి బెంచ్ ప్రెష్ విభాగంలో రామచంద్రపురం మండలం వెలంపాలం గ్రామానికి చెందిన పిల్లి రాంబాబు గోల్డ్ మెడల్ సాధించి మొదటి స్థానంలో నిలిచారు. ఆదివారం అమలాపురంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇదే గ్రామానికి చెందిన దొమ్మేటి నాగేశ్వరరావు పవర్ లిఫ్టింగ్ మాస్టర్ కేటగిరిలో మొదట స్థానంలో నిలిచారు. తోటపేటకు చెందిన అల్లం దుర్గాప్రసాద్(నాని) 66 కేజీల జూనియర్స్ పవర్ లిఫ్టింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఉప్పుమిల్లి గ్రామానికి చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్ 59 కేజీల బెంచ్ ప్రెస్ కేటగిరిలో సిల్వర్ మెడల్ సాధించాడు. మాస్టర్స్ బెంచ్ ప్రెస్ విభాగంలో అన్నయపేటకు చెందిన నక్కా భీమశంకరం మూడో స్థానంలో నిలిచారు. విజేతలు అందరిని వీరభద్ర జిమ్ అధినేత పాట్టిపోతుల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గుడాల లక్ష్మీనారాయణ, అడవి కుమార్, అనిశెట్టి అప్పారావు, దంగుడుబియ్యం కన్నబాబు, మీసాల బాలరాజు తదితరులు అభినందించారు.

తాతపూడి కెనాల్‌ను మెరుగుపర్చాలి

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి కాలిబాట వంతెన వద్ద గల రేవును మెరుగుపర్చాల్సి ఉందని గ్రామస్తులు అంటున్నారు. గోదావరి గట్టు వెంబడి ఉన్న బ్యాంకు కెనాల్‌లో వంతెన వద్ద రేవులోని రక్షణ స్తంభాలు దెబ్బతిని ఉన్నాయి. రేవులోకి వెళ్లకుండా ఏర్పాటు చేసిన స్తంభాలు ఒరిగిపోగా, రేవులోని రాళ్లు ఛిద్రంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన పశువులను రేవులో శుభ్రం చేస్తుంటారు. వర్షాకాలంలో కాలువలో నీటి ప్రవాహం ఉధృతంగా మారుతుంది. రేవులో రక్షణ స్తంభాలను పటిష్ట పర్చాల్సిన అవసరం ఉందని పలువురు స్థానిక రైతులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.



రక్షణ స్తంభాలు ఒరిగిన తాతపూడి రేవు

నేడు అమ్మవార్ల తీర్థ మహోత్సవాలు

కాజులూరు: మండలంలోని కోలంకలో సోమవారం గ్రామదేవత కోలపిల్లమ్మ అమ్మవారికి తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో సుమారు 400 ఏళ్ల క్రితం వెలసిన కోలపిల్లమ్మ అమ్మవారిని ప్రజలు గ్రామదేవతగా కొలుస్తారు. 300 ఏళ్ల క్రితం చెక్కతో తయారు చేసిన అమ్మవారి విగ్రహం నేటికి చెక్కుచెదరకుండా దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిస్తుంది. ఏటా వైశాఖ మాసం అమావాస్య రోజున అమ్మవారికి తీర్థమహోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గ్రామంలో జాతర నిర్వహించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలతో అమ్మవారిని తెల్లవారే వరకు గ్రామ వీధుల్లో ఊరేగించిన భక్తులు సోమవారం వేకువజాము నుంచి ఆలయాల వద్ద తీర్థం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాల నుంచి సుమారు మూడు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారని తీర్థమహోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం తగిన వసతి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.



ప్రత్యేక అలంకరణలో వనువులమ్మవారు



కోలపిల్లమ్మ అమ్మవారు

వనువులమ్మ జాతర ప్రారంభం

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప గ్రామ దేవత వనువులమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ నిర్వాహకులు విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సోమవారం ఆలయం వద్ద తీర్థం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పరిసరి ప్రాంతాల భక్తులు తీర్థంలో పాల్గొనాలని కోరారు.

ధనమ్మమర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో వెలసిన ధనమ్మమర్రిలో ధనమ్మ తల్లికి ఆదివారం భక్తులు విశేష పూజలు చేశారు. పర్యాటక కేంద్రంగా ఉన్న ధనమ్మర్రికి వేసవి సెలవులు కావడంతో కొత్తపేట, కపిలేశ్వరపురం, ఆలమూరు, కె.గంగవరం, అయినవిల్లి మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సభ్యులతో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాప్రాంగణంలో చిన్నారుల ఆటపాటలతో సందడిగా మారింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



వల్లూరు పాఠశాలలో గ్రూపు ఫొటో దిగిన 2010 పూర్వ విద్యార్థులు



ఉపాధ్యాయ బృందంతో పాఠశాల పూర్వ విద్యార్థులు

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2010 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశమయ్యారు. 15 సంవత్సరాలు తర్వాత వారు చదువుకున్న తరగతి గదుల్లో సంచరిస్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని బాగొద్వేగానికి లోనయ్యారు. వారితో కలిసి చదువుకున్న స్నేహితులకు తమ కుటుంబ సభ్యులను పరిచయం చేస్తూ ఆనందంగా గడిపారు. జీవితంలో వారు స్థిరపడిన విధానాన్ని చెప్పుకున్నారు. వారికి పాఠాలు చెప్పిన గురువులను సత్కరించి వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిన్నారుల కళా ప్రదర్శనలను వీక్షించి మైమరిచిపోయారు. పాఠశాలను వీడుతూ వారి జ్ఞాపకాలకు తీపి గుర్తుగా గ్రూపు ఫొటో దిగారు.

క్రమశిక్షణతో ఉన్నత విద్య

రామచంద్రపురం రూరల్: ఇష్టంతో అభ్యసించిన ఏ విద్యార్థి అయినా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుంటాడని జెడ్పీ ఉన్నత పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయుడు కోట కృష్ణమూర్తి అన్నారు. ద్రాక్షారామ హైస్కూల్‌లో 2002–07 మధ్య ఈ పాఠశాలలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక పాఠశాలలో ఆదివారం ఘనంగా జరిగింది. వక్తలు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించడం వల్ల ఈ బ్యాచ్‌లో ఉన్న విద్యార్థులు ఎక్కువ మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని ప్రశంసించారు. సినిమారంగంలో పనిచేస్తున్న కుంపట్ల శేఖర్, మల్లేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గతంలోను, ఇప్పుడు పని చేస్తున్న అరవ విస్సు మాస్టర్ కోరిక మేరకు రూ.40 వేలు విలువైన 4 సీసీ కెమెరాలను స్కూల్‌కు అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థులందరూ కూడా ఆత్మీయంగా ఆనాటి మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ, ఉల్లాసంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు కోట కృష్ణమూర్తి, అరవ విస్సు, బాబీ, పి.రామకష్ణ, అరుంధతి, బాపిరాజు, సత్య, శేషవేణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విద్యార్థి బృందం మణికంఠ, ప్రసాద్, లక్ష్మణ్, కోటిపల్లి ప్రసాద్, అంబిక, తులసి నిర్వహించారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి

రాజోలు: ఇండోర్ రాజ్యాన్ని పాలించిన అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని ఆదివారం రాజోలులో దత్తాత్రేయ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించారు. 1767 నుంచి 1795 వరకు స్త్రీ శక్తికి మారుపేరుగా అహల్యాబాయి హోల్కర్ పరిపాలన సాగించారని మాజీ ఎమ్మెల్యే వేమా అన్నారు. అలాగే ఇటీవల మైసూర్ దత్తపీఠం సచ్చిదానంద స్వామిజీ నిర్వహించిన భగవద్గీత పోటీల్లో బంగారు పతకం సాధించిన నారంభట్ల నిత్యను సత్కరించారు. శివాజీ మహరాజ్ ప్రతిమను నిత్యకు బహూకరించారు. ఆర్యవైశ్య మహిళా సంఘ అధ్యక్షురాలు కాసు భవానీ, కార్యదర్శి కొత్త భవానీలు చిన్నారి నిత్యకు పట్టువస్త్రాలు అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, మేడిచర్ల చాణిక్య, దేవళ్ల మాణిక్యాలరావు, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, అడబాల రాంబాబు, రాజా నాగరత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

రాయవరం: మండలంలోని వెంటూరు గ్రామంలో శ్రీప్రసన్నాంజనేయస్వామి వారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నాల్గవ రోజు అభిషేకాలు, విశేష పూజలు చేశారు ఆలయ అర్చకులు మద్దిరాల సాయికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేణుగోపాలాచార్యులు స్వామివారికి వివిధ రకాల ద్రవాలతో అభిషేకాలు, సహస్ర నిమ్మకాయలతో పూజలు, సింధూరుపూజ, నాగవల్లీదళాలతో అర్చనలు, హోమాన్ని చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ముత్యాల వీరబాబు, చుండ్రు రవికుమార్, మాటూరి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

చెల్లూరులో భారీ అన్న సమారాధన:

మండలంలోని చెల్లూరులో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. శ్రీవీరాంజనేయ బాల భక్త సమాజం, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనలో చెల్లూరు, వెంటూరు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వెంటూరులో ప్రత్యేక పూజలందుకున్న ప్రసన్నాంజనేయస్వామి

గురువును ఆశ్రయించినవాడే నిజమైన భక్తుడు

అయినవిల్లి: పరంపర ఆచార్యుడిని గురువుగా స్వీకరించినవాడే నిజమైన భక్తుడని, పరంపర నుంచి వచ్చిన గురువును ఆశ్రయించిన భక్తుడు సాధన ద్వారా భగవంతుడి నిజమైన రూపం దర్శనమిస్తుందని నల్లచెరువు అంతర్జాతీయ మందిర్ నిర్వాహకుడు ప్రభూజీ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఆదివారం ప్రభూజీ సుందర శ్రీనివాస్‌దాస్ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ స్వామికి విశేష పూజలు చేశారు. హరినామ సంకీర్తనలు, తులసి పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీమద్భాగవత ప్రవచనం నిర్వహించారు. మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని కీర్తించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు.



విశేష పూజలు నిర్వహిస్తున్న ప్రభూజీ సుందర శ్రీనివాస్‌దాస్